ప్రజాశక్తి

మంగళవారం 6 డిసెంబర్ 2022 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

అదే తీరు..అర్జీల జోరు

- స్పందనకు వెల్లువెత్తుతున్న అర్జీదారులు
- క్షేత్రస్థాయిలో అధికారులు చేతులెత్తేయడంతోనే ఈ పరిస్థితి
- గడపగడపకూ కార్యక్రమంలోనూ భారీగా అర్జీలు ఇస్తున్న పేదలు



స్పందనకు సోమవారం వచ్చిన అర్జీదారులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సచివాలయ వ్యవస్థ వచ్చాక అన్నీ సమస్యలకూ అక్కడే పరిష్కారం చూపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయం మాత్రం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. క్షేత్రస్థాయిలో పాలనా వ్యవస్థపైనే సందిగ్ధం నెలకొనేలా వారంవారం కలెక్టర్ నిర్వహించే స్పందనకు అర్జీదారులు వస్తున్నారు. కనీసం ఐదు వందల మందికి పైగా వస్తున్నారు. గ్రామంలోనే అన్నిశాఖల అధికారులు కూర్చుంటున్నారు. పట్టణాల్లోనైతే 100 ఇళ్లకు ఓ వాలంటీర్.. పల్లెల్లో 50 ఇళ్లకు ఓ వాలంటీర్ ఉన్నారు. వార్డుకో సచివాలయం పట్టణాల్లో ఉంటే పంచాయతీల్లోనూ సచివాలయాలు పెట్టారు. ఇవన్నీ జనం బాధలు తీర్చడానికే.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు వందలాది సేవలు అక్కడ అందించాల్సి ఉంది. పై స్థాయి అధికారుల వద్దకు పేదలు లేదా ఏదైనా సమస్యతో ఉన్న బాధితులకు సచివాలయంలోనే పరిష్కారం చూపాల్సి ఉంది. ఇప్పుడు సచివాలయాలు రాజకీయాలతోనే నిండిపోయాయి. పాలకపక్ష నేతలు చెప్పకుండా సొంతంగా నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారు. దీంతో కొంతభాగం జనాభాకు సమస్యలు పరిష్కారం కావడం లేదు. పాలనాపరమైన తప్పిదాలే ఇందుకు కారణంగా కనిపిస్తున్నాయి. పాలనా సౌలభ్యం కోసం జిల్లాలను విభజించారు. చిన్నచిన్న జిల్లాలు చేసినా పాలనాఫలాలు పూర్తిగా అందలేదు. జిల్లాలో ఇప్పుడు 8 నియోజకవర్గాలే ఉన్నాయి. జనాభా కూడా తగ్గింది. అయితే సమస్యలు మాత్రం తగ్గలేదు. సోమవారం నాడు కలెక్టర్ నిర్వహించిన స్పందనకు భారీగానే అర్జీదారులు వచ్చారు. బారులు తీరారు. అర్జీలు చేతపట్టుకొని అధికారులకు గోడు వెళ్లబోసుకుంటున్నారు. కొందరు రెండు, మూడు సార్లు కూడా తిరిగినా పనులు కావడం లేదు. సంక్షేమ పథకాలకు లబ్ధితో పాటు అనేక రకాల భూవివాదాలపై అర్జీలు వస్తున్నాయి. వ్యక్తిగత సాయాలు అందడం లేదని, రుణాలు ఇవ్వడం లేదని, పింఛన్లు, రేషన్‌కార్డులు, జగనన్న ఇళ్ల స్థలాల వివాదాలు ఎక్కువగా ▶ 2లో

మృత్యు మలుపు

- మంచులో మలుపు కనిపించక అదుపుతప్పిన టాటా ఏస్ వాహనం
- నలుగురు అయ్యప్ప భక్తులు దుర్మరణం
- 18 మందికి తీవ్ర గాయాలు
- తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు

ప్రజాశక్తి-వేమూరు (బాపట్ల జిల్లా)

మంచు తీవ్రత ఎక్కువగా ఉండటంతో మలుపు కనిపించక వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు అయ్యప్పస్వామి భక్తులు దుర్మరణం చెందారు. 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బాపట్ల జిల్లా వేమూరు మండలం, జంపని శివారు చెరువు మలుపు వద్ద సోమవారం జరిగింది.

కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం నీలిపూడి గ్రామానికి చెందిన 23 మంది భక్తులు అయ్యప్ప దీక్ష తీసుకున్నారు. ▶ 2లో



ఘటనాస్థలంలో మృతదేహాలు



బోల్తా పడ్డ టాటా ఏస్,



మృతులు బడితి రమేష్, పవన్‌కుమార్, పాశం రమేష్, పాండు రంగారావు (ఫైల్)



మెరుపు ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పదోన్నతులు పొందిన వారికి స్థానాలు కేటాయించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మెరుపు ధర్నా

జిల్లా ఏర్పాటు సరే.. అభివృద్ధి ఏదీ?



- జిల్లా సమగ్రాభివృద్ధిపై దృష్టి పెట్టని పాలకులు
- నిధుల లేమే ప్రధాన కారణం
- నేడు బాపట్ల జిల్లా అభివృద్ధి మండలి సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా ఏర్పడి.. ఎనిమిది నెలలైంది. అయినా నేటికీ బాలారిష్టాల దశలోనే ఉంది. నిధుల లేమి కారణంగా జిల్లాలో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. అన్ని నియోజకవర్గాల్లో సమస్యలు కొకొల్లలుగా ఉన్నాయి. జిల్లా అయితే ఏర్పాటయింది గానీ సమస్యల పరిష్కారం, అభివృద్ధి అంతంతమాత్రమే... పరిపాలన ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. సమీక్షలు,వీడియో కాన్ఫరెన్స్‌లు, పర్యటనలతో జిల్లా అధికారులు హడావుడిగా ఉంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో సమస్యలు మాత్రం అలానే ఉంటున్నాయి. జిల్లా సమగ్రాభివృద్ధిని పాలకులు పట్టించుకోవడం లేదు. నూతనంగా జిల్లా ఏర్పడ్డాక బాపట్ల జిల్లా అభివృద్ధి మండలి సమీక్షా సమావేశం (డిఆర్‌సి) రెండోసారి కలెక్టరేట్‌లో మంగళవారం జరగనుంది.

పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జిల్లాలను ఏర్పాటుచేసింది. కానీ జిల్లా ఏర్పడి ఎనిమిది మాసాలు నిండినా జిల్లా కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పన అనేది జరగలేదు. జిల్లా ఏర్పడ్డాక అందుబాటులో ఉన్న మానవ వనరుల కేంద్ర భవనాలు, క్వార్టర్లలో జిల్లా కార్యాలయాలను ఏర్పాటుచేశారు. కానీ నేటికి కావలసిన మేరకు వసతుల కల్పన సమకూరలేదు. సరిపడా సిబ్బంది లేరు. ఉన్నదానితోనే జిల్లా అధికారులు తమ కార్యాలయ పనులు నెట్టుకొస్తున్నారు. గతంలో నిర్మించిన ప్రభుత్వ క్వార్టర్లలో ఏర్పాటు చేసిన కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. చుట్టూ దట్టంగా పెరిగి ఉన్న చెట్లు, పుట్టల నుంచి పాములు, తేళ్లు వస్తున్నాయి. పాత క్వార్టర్ల స్లాబ్‌లు దెబ్బతిని ఉండటంతో వర్షం కురిస్తే లోపలికి వర్షపు నీరు వస్తోంది. కొందరు జిల్లా అధికారులు స్లాబ్ తొలగించి రేకులు వేసుకుని,సీలింగ్ చేసుకుని అందులో విధులు నిర్వర్తిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ లాంటి జిల్లా కార్యాలయాలు వసతిగృహాలలోనే సర్దుకుంటున్నారు. కొన్ని జిల్లా కార్యాలయాలు మండల, డివిజన్ స్థాయి ఆఫీసుల్లోనే ఉన్నాయి. ఒక గదిలో టేబుల్, కుర్చీ వేసుకుని విధులు నిర్వర్తిస్తున్నారు. ఫర్నిచర్ కూడా అందుబాటులోకి రాకపోవడంతో ఎవరికి వారే సమకూర్చుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎస్‌పి కార్యాలయాలు మాత్రం ఇటీవలే సౌకర్యాలతో అందుబాటులో కొచ్చాయి. బాపట్ల జిల్లా అయితే ఏర్పాటు చేశారు గానీ ఇందుకు అనుగుణంగా నిధులు విడుదల కాలేదు. నిధులు అందుబాటులోకి రాకపోవడంతో జిల్లా అధికారులు ఉసూరుమంటూ విధులు నెట్టుకొస్తున్నారు. నూతనంగా జిల్లా కార్యాలయ భవనాల కోసం స్థల సేకరణ నేటికీ జరగలేదు. కర్లపాలెం రోడ్డులో ప్యాడిసన్ పేట వద్ద బాపట్ల, చీరాల రోడ్డులో ఉన్న స్థలాలను పరిశీలించారు కానీ ఎలాంటి నిర్ణయం జరగలేదు.

జిల్లా సమగ్రాభివృద్ధి చెందాలంటే రవాణా, విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు లాంటి రంగాలపై దృష్టి ▶ 3లో



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్, మేయర్, ఎమ్మెల్యే

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- క్రీడా స్ఫూర్తితో ఉన్నత స్థానాలకు ఎదగాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులు క్రీడలలో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, క్రీడల స్ఫూర్తితో జీవితంలోనూ ఉన్నత స్థానానికి ఎదగాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక మినీ స్టేడియంలో ఈ నెల 5,6వ తేదీలలో జరుగుతున్న 'జగనన్న క్రీడా సంబరాలు'ను ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఇతర అతిథులతో కలిసి క్రీడాకారులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శారీరక దఢత్వంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి కూడా క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడల అభివద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జిల్లాలో ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో ఉన్నారన్నారు. అన్ని సదుపాయాలతో స్టేడియాలను నిర్మించి ప్రభుత్వం ▶ 2లో

మృత్యు మలుపు

(మొదటిపేజీ తరువాయి)

ఈ నెల ఒకటిన అంతా కలిసి టాటాఏస్ ఆటోలో విజయవాడ రైల్వేస్టేషన్‌కు వచ్చి శబరిమలై వెళ్లారు. దైవదర్శనం ముగించుకుని, దీక్ష విరమించి నాలుగో తేదీన శబరిమలై నుంచి రైల్లో బయలుదేరారు. సోమవారం ఉదయం తెనాలి రైల్వేస్టేషన్‌లో దిగారు. ముందుగా మాట్లాడుకున్న ప్రకారం అదే టాటాఏస్ ఆటో తెనాలి రైల్వేస్టేషన్‌లో సిద్ధంగా ఉంది. టాటా ఏస్ ఎక్కి బయలుదేరారు. వాహనం బయలుదేరిన పది నిమిషాల్లోనే జంపని శివారు చెరువు మలుపులో మంచుకు రోడ్డు కనిపించకప డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఒక్కసారిగా వాహనం రెండు పల్టీలు కొట్టింది. ఏం జరిగిందో తెలుసుకునేలాగానే బొలిశెట్టి పాండురంగారావు(40), పాశం రమేష్(55), బుడితి రమేష్(42) అక్కడికక్కడే మృతి చెందారు. క్షతగాత్రుల హాహాకారాలు విన్న స్థానికులు 108 అంబులెన్స్ సాయంతో వారిని అసుపత్రికి చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ బుద్దన పవన్‌కుమార్(25) మృతి చెందాడు. మరో ముగ్గురు పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. మిగిలిన వారు తెనాలి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఎంతో ఉత్సాహంగా దీక్ష ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో, అప్పటివరకూ తమతో పాటే ఉన్న నలుగురు స్వాముల ప్రాణాలు కోల్పోవటంతో మిగిలిన వారు నివ్వెరపోయారు. దట్టంగా పట్టిన మంచే ప్రమాదానికి కారణమని క్షతగాత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదే తీరు.. అర్జీల జోరు..

(మొదటిపేజీ తరువాయి)

వస్తున్నాయి. మరోవైపు భూముల సమస్యలపైనా ఎక్కువ అర్జీలు అందుతున్నాయి. సచివాలయాల్లో జరిగే తప్పిదాలు, అక్రమాలపైనా అర్జీలు వస్తున్నాయి. కొండపి మండలం, పెద్దకండ్లగుంటలో సచివాలయ సిబ్బంది అక్రమాలకు పాల్పడి భూములను నిబంధనలకు విరుద్ధంగా నమోదు చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఇలా అనేక చోట్ల నుంచి భూములకు సంబంధించిన ఫిర్యాదులు పెరిగాయి. భూముల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. రికార్డులు సరిగా లేవు. ప్రస్తుతం భూములపై సర్వే కూడా జరుగుతోంది. అన్నీ సక్రమంగా ఉంటేనే పాసుపుస్తకాలు ఇస్తున్నారు. వివాదాలు ఉన్న వాటిని పక్కన పెడుతున్నారు. వీళ్లంతా అర్జీలు తీసుకుని కలెక్టర్ వద్దకు వస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు కొందరు రాజకీయ ఒత్తిళ్లతో చేతులెత్తేస్తున్నారు. బాధితులు కలిసినా స్పందన లేదు. దీంతో ఉన్నతాధికారుల వద్దకు రావడం అనివార్యమైంది. ఇక్కడ నుంచి అర్జీలను కలెక్టర్ పరిశీలించి తదుపరి చర్యలకోసం మళ్లీ సంబంధిత అధికారులకు పంపుతున్నారు. అక్కడపెండింగులో పెడుతున్నారు. స్పందనకు ముందు కలెక్టర్ కూడా గతంలో వచ్చిన అర్జీలపై సమీక్ష చేస్తున్నారు.వాటిపరిష్కారంపై సమీక్షలో అధి కారులకు తగిన సూచనలు ఇస్తున్నారు. పరిష్కారం విషయానికి వచ్చేసరికి ముందుకు సాగడంలేదు. ఇక పాలకపక్ష నేతలు నిర్వహించే గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలోనూ పేదల నుంచి భారీగా అర్జీలు అందుతున్నాయి. మంత్రి మొదలు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులకు పేదల నుంచి ప్రతి వీధిలో ఇంటింటి నుంచీ ఏదో సమస్యపై వినతులు వస్తున్నాయి. వాటిని కూడా సచివాలయ సిబ్బందికి చెప్పి ముందుకు పోతున్నారు. ఇలా కూడా అర్జీలు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. వీటిని పరిశీలించి పరిష్కారానికి ఓ విధానాన్ని రూపొందించాలి. శాఖల వారీగా జవాబు దారీతనం పెంచాలి. అలాకాకుండా ఉంటే ఏదీ పరిష్కారం కాదు. ఎవరు కనిపించినా అర్జీ ఇవ్వడం పరిపాటిగా మారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అర్జీలు ఈ స్థాయిలో రావడంపై దృష్టి సారించాలి. క్షేత్రస్థాయిలో పాలనావ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

పొదిలి : ఎరువులు పురుగుమందుల దుకాణాల నిర్వాహకులు రైతులకు నకిలీ పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఒ జైనులాబ్దిన్ హెచ్చరించారు. పొదిలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలన్నారు.

వెలుగొండ బాధితులకు న్యాయం చేయాలి

మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-మార్కాపురం

పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి రెండున్నర దశాబ్దాలు దాటినా నిర్వాసితుల సమస్యలు పరిష్కరం కాలేదు. తమ సమస్యలు పరిష్కరించాలని నేటికీ అర్జీలు అందజేస్తూనే ఉన్నారు. పరిహారం కోసం ముంపు బాధితులు ఎదురు చూస్తున్నారు. సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, వెలుగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ ఎం.సరళావందనం, ఎస్‌డిసి రామసుబ్బయ్య, వెలుగొండ ప్రాజెక్టు సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాధవన్ మాట్లాడుతూ వెలుగొండ ముంపు బాధితుల సమస్యలపై వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. న్యాయబద్ధమైన అర్జీలకు న్యాయం చేయాలన్నారు. బాధితులు ఏ ఒక్కరూ అన్యాయానికి గురికాకూడదన్నారు. వెలుగొండ ప్రాజెక్టు అంశంపై సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. వెలుగొండ ముంపు బాధితులు కొందరు అర్జీలతో మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. నేటికీ అర్హత కలిగిన వారు పునరావాస ప్యాకేజీ జాబితాలో



అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటి కలెక్టర్ సరళావందనం

లేరని, పరిహారం ఇప్పించాలని అర్జీలు అందించారు. కొన్ని అసైన్డ్ భూములకు పరిహారం రాలేదని తెలిపారు. కొన్ని గృహాలకు పరిహారం అందించాల్సి ఉందన్నారు. ముంపు బాధిత గ్రామాల నుంచి వచ్చిన అర్జీలన్నింటినీ రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి పరిశీలన ప్రారంభించారు.

వైసిపి పాలనలో బీసీలకు అన్యాయం

టిడిపి ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

వైసిపి పాలనలో బీసీలకు అన్యాయం జరుగుతుందని టిడిపి నాయకుడు కొటారి నాగేశ్వరరావు తెలిపారు. ఇదేమి ఖర్మ బీసీలకు అంటూ తహశీల్దారు కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దారు మురళీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.శ్రీనివాసరావు, జి.సుబ్బారావు, టి.రమాదేవి, టి. అనంతమ్మ, పెళ్ళూరి చిన వెంకటేశ్వర్లు, కుంచాల శ్రీను, లక్ష్మి, దుర్గామల్లేశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు. **శింగరాయకొండ :** వైసిపి ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుందని టిడిపి నాయకులు తెలిపారు. ఇదేం కర్మ బీసీల కంటూ టిడిపి ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు



ధర్నా నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

మాట్లాడుతూ బీసీలు జరుగుతున్న అన్యాయం గురించి వివరించారు. అనంతరం తహశీల్దారు ఉషాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కృష్ణ, కూనపురెడ్డి వెంకట సుబ్బారావు, మించల బ్రహ్మయ్య ,కన్నా శ్యాంప్రసాద్ , పులి ప్రసాద్ ,గాలి హరి బాబు, పసుపులేటి శేషు, దక్షిణం శ్రీను, కనిగిరి వెంకటేశ్వర్లు, సన్నీబోయిన మాలకొండయ్య ,నరాల సుధాకర్ , పాత శింగరాయకొండ ఉప సర్పంచి నక్కా బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

పొదిలి : పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంట్రాక్టర్ కల్లం సుబ్బారెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ చీఫ్ బి.బాలునాయక్‌కు విజ్ఞప్తి చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన బాలూనాయక్‌ను సోమవారం విజయవాడలో కల్లం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పొదిలి పంచాయతీరాజ్ సబ్ డివిజన్ డిఇ శ్రీధర్‌రెడ్డి, వైసిపి పొదిలి మండల కన్వీనర్ జి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తున్న ప్రోత్సాహకాన్ని ఉపయోగించుకుని క్రీడలలో రాణించాలని సూచించారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులలోని ప్రతిభను గుర్తించడానికి క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర ప్రభుత్వం క్రీడాపోటీలను నిర్వహిస్తోందన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో అన్ని నియోజకవర్గాల నుంచి పాల్గొంటున్న క్రీడాకారులు మెరుగైన ప్రతిభతో రాణించి, రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తేవాలని ఆయన ఆకాంక్షించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు కూడా విద్యార్థులు సమాన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ పోటీలను కలెక్టర్ ఎమ్మెల్యే, మేయర్ ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టెప్ సిఇఒ బి.బాబూరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ జి.రాజరాజేశ్వరి, విశ్రాంత పిటిసి ప్రిన్సిపల్ కాకుమాను రాజశిఖామణి, మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న టీడీపీ బిసి నాయకులు

వైసిపి పాలనలో బిసిలకు ఒరిగిందేమీ లేదు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

బిసిలకు వైసిపి పాలనలో ఒరిగిందేమీ లేదని బిసిలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక మండల కార్యాలయం వద్ద టిడిపి బిసి నాయకులు నిరసన దీక్ష, ఆందోళన చేపట్టారు.వేమూరు నియోజకవర్గ బిసి సెల్ నాయకులు బట్టు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ప్రసంగించారు. దీపాల ప్రసాద్,రాయన ప్రసాద్, వామనపల్లి కోటేశ్వరరావు, పంచుమర్థి శంకరరావు, జయసిలరావు, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తుందని జడ్పిటిసి సభ్యులు మర్రివాడ వెంకట పావని అన్నారు. విద్యా జ్యోతి పథకంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు సోమవారం విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక గుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం 168 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల పరిషత్ మాజీ అధ్యక్షులు చెన్ను కోటేశ్వరరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిషోర్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులి లాజర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పర్చూరు

వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నవారికి స్థానిక వైసిపి కార్యాలయంలో పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి రామనాథం బాబు చేతుల మీదుగా రూ.28,31,000 విలువగల 42 చెక్కులను పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఇన్‌ఛార్జి రామనాథం బాబుకు ధన్యవాదాలు తెలిపి భవిష్యత్‌లో వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓట్లు చేర్పింపునకు 8 ఆఖరు తేదీ

ప్రజాశక్తి-అమృతలూరు

విద్యా దీవెనలో అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల తహశీల్దార్ పి మెహర్ కుమార్ ఆదేశించారు. అమృతలూరు మండల పరిషత్ కార్యలయంలో సోమవారం బిఎల్‌ఓలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెహర్ కుమార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులుకు ఫారం 7 ద్వారా సమర్పించాలని అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని జగనన్న విద్యాదీవెన అర్హుల వివరాలు తహశీల్దార్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం శివయ్య, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్..

ప్రజాశక్తి-కారంచేడు: బాపట్ల జిల్లా కారంచేడు కాల్వ సెంటర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్‌టిసి బస్సును టిప్పర్ లారీ ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇరు వాహనాల డ్రైవర్లతో సహా మరో పది మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చీరాల నుంచి నర్సరావుపేటకు ఆర్‌టిసి బస్సు వెళుతుండగా మార్టూరు నుంచి చీరాలకు వస్తున్న టిప్పర్ లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో యాభై మంది ప్రయాణికులు ఉన్నారు. కారంచేడు-పర్చూరు రహదారిలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సు దూసుకు పోకుండా నిలుపుదల చేయడంతో పెను ప్రమాదం తప్పింది. కారంచేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని చట్లమిట్ల వద్ద విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో బోల్తాపడగా పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. వివరాల ప్రకారం.. మండలంలోని రాజంపల్లి సమీపంలో కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు 15 మంది గాయపడ్డారు. వీరందరూ బి చెర్లోపల్లి నుంచి ప్రెగళ్లపాడు, ఏనుగులదిన్నెపాడు, చట్లమీట్ల మీదుగా రాజంపల్లి కేంద్రీయ విద్యాలయంలో చదువుకునేందుకు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఆ మార్గంలో ఆర్టీసి బస్సు లేని కారణంగా ఆటోలో ప్రయాణించాల్సి వస్తోంది. ప్రమాద విషయం తెలుసుకున్న స్థానికులు 108 అంబులెన్స్ వాహనానికి సమాచారం అందించారు. స్వల్ప గాయాలైన వారిని సమీపంలోని హనుమాన్ జంక్షన్ (కుంట)లో ప్రథమ చికిత్స నిర్వహించగా తీవ్రంగా గాయపడిన వారిని మార్కాపురంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. గాయపడిన విద్యార్థులకు డాక్టర్ టి.సంజీవ్ వైద్య సేవలు అందించారు. అక్కడ నుంచి నలుగురిని మెరుగైన వైద్యం కోసం పల్నాడు జిల్లా నరసరావుపేటకు తరలించారు. పెద్దారవీడు ఎస్ఐ పులి రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.



గాయపడిన విద్యార్థి

దళితుల భూములు దళితులకే ఇవ్వాలి: వ్యకాస

ప్రజాశక్తి-బల్లికురవ

ప్రభుత్వం పంపిణీ చేసిన దళితుల భూములు దళితులకే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం బల్లికురవ మండల తహశీల్దారు కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూకట్లపల్లి దళితులతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి వ్యకాస బాపట్ల జిల్లా కార్యదర్శి కె కృష్ణమోహన్ మాట్లాడుతూ చట్ట ప్రకారం దళితులకు చెందిన భూములను దళితులకు కాకుండా అధికారులు పెత్తందారులకు చెందేలా సపోర్టు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని విమర్శించారు. పెత్తందారులు దళితుల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకొని అదేమని అడిగితే మీకు దిక్కున్నచోట చెప్పుకోండి అని అంటున్నారని పేర్కొన్నారు. అధికారులు పేదల మాట వినటంలేదని వాపోయారు. సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత నెల ఈ విషయాన్ని బాపట్ల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా కలెక్టర్ కూకట్లపల్లి గ్రామానికి వచ్చి భూములను పరిశీలన చేసి 24 గంటల్లో ఈ భూములు సంబంధించిన సమస్యను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారని, కానీ ఇప్పటికీ నెల రోజులు గడుస్తున్నా ఎటువంటి చర్యలూ చేపట్టలేదని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దారుకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్లపల్లి భూ పోరాట కమిటీ సభ్యులు ముట్లూరి లాభాలు ఏర్పుల బుజ్జిబాబు గొల్లపూడి అక్కరావు, తంగిరాల రాణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరణం గ్రూపులోకి రామన్నపేట ఉపసర్పంచ్

ప్రజాశక్తి-వేటపాలెం

ఆమంచి కృష్ణమోహన్ వర్గంగా పేరుగాంచిన రామన్నపేట ఉపసర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు కరణం బలరాంకు మద్దతు ప్రకటించారు. సోమవారం చీరాల మున్సిపాలిటీలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సమక్షంలో మద్దతు ప్రటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరాంకు సుబ్బారావు శాలువ కప్పి బొకే అందించారు. ఎమ్మెల్యే తనయుడు చీరాల ఇన్‌ఛార్జి వెంకటేష్‌బాబును కలిసి మాటామంతి కలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తి ఆంజనేయులు, దేవన సుబ్బారాయుడు, బాసిన కిరణ్, పిచ్చుక భద్రం, దేవన నరేంద్ర, కడియం సుబ్రహ్మణ్యం, ఆవుల అశోక్ పాల్గొన్నారు.

చీరాల వైసిపి పరిశీలకులను కలిసిన ఆమంచి అనుచరులు

ప్రజాశక్తి-వేటపాలెం: వైసిపి నియోజకవర్గ పార్టీ పరిశీలకులుగా మురుగుడు హనుమంతరావు చీరాలకు సోమవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమంచి అనుచరణ గణం ఈపురుపాలెం బైపాస్ రోడ్డు వద్ద వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. చీరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మార్పు గ్రగోరి, వేటపాలెం జడ్పిటిసి బండ్ల తిరుమలదేవి, చీరాల జడ్పిటిసి ఆకురాతి పద్మినిదేవి ఉన్నారు. విజయవాడలో ఏడో తేదీన జరగనున్న బీసీల సదస్సుకు సంబంధించి ముఖ్యమైన నాయకులతో మాట్లాడేందుకు చీరాల వచ్చినట్లు ప్రకటించారు. చీరాల నియోజకవర్గ స్థాయి సమస్యల గురించి హనుమంతరావుకు ఏకరువు పెట్టారు.

జిల్లా ఏర్పాటు సరే.. అభివృద్ధి ఏదీ?

(మొదటిపేజీ తరువాయి)

పెట్టాలి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి. నిధులను సాధించాలి. జిల్లా కేంద్రంలో అన్ని సౌకర్యాలతో వైద్యశాల ఏర్పాటు కావాల్సి ఉంది. బాపట్ల, చీరాలలో ప్రాంతీయ వైద్యశాలలు ఉన్నాయి. కానీ అత్యవసర వైద్యసేవల కోసం గుంటూరు లేదా విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. బాపట్లలో రూ.550 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, 300 పడకలతో బోధనాసుపత్రి, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. శంకుస్థాపనలు జరిగాయి. సదరు స్థలాన్ని చదును చేసే పనులు చేపట్టారు. కానీ నిధులు విడుదల కాక నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. జిల్లా పరిధిలో విజయవాడ-చెన్నై జాతీయ రహదారి ఉంది. నార్కెట్‌పల్లి- అద్దంకి ఎక్స్‌ప్రెస్ హైవే ఉంది. వాడరేవు-పిడుగురాళ్ళ జాతీయ రహదారి ఉంది. ఈ రహదారుల్లో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యవసర చికిత్స కోసం అద్దంకి, మార్టూరు, పర్చూరుల్లో ఉన్న వైద్యశాల్లో ట్రామాకేర్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అందుకు అనుగుణంగా వైద్యులు, సిబ్బందిని, వైద్య సామగ్రిని వైద్యశాలల్లో ఏర్పాటు చేయాలి. జిల్లా కేంద్రానికి రవాణా సదుపాయం అంతంత మాత్రంగా ఉంది. బాపట్లకు ప్రజలు సులభతరంగా వచ్చేందుకు వీలుగా నియోజకవర్గ కేంద్రాలు, ముఖ్యమైన గ్రామాల మీదుగా ఆర్‌టిసి బస్సు సర్వీసులు నడపాలి. ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం గుంటూరు, తెనాలి నుంచి బాపట్లకు నాన్‌స్టాప్ బస్సు సర్వీసులు నడపాలి. జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య పంట పొలాలకు సాగు నీరందకపోవడం. పంట కాలువలు, మురుగు కాలువల్లో విపరీతంగా తూడు కాడ పెరిగిపోయింది. కాలువల్లో పూడికలను తీయలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నిధులు లేక ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. బాపట్ల జిల్లా పర్యాటక రంగానికి అనుకూలమైంది. 74 కిలోమీటర్ల సముద్రతీరం ఉంది. ప్రకృతి సిద్ధమైన మడ అడవులు ఉన్నాయి. సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌లు ఉన్నాయి. తీరంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో రీసార్టుల ఏర్పాటు ద్వారా మరింతగా ఆదాయం సమకూరుతుంది. వాయుసేనకు చెందిన మ్యూజియం ప్రతిపాదనలు ఉన్నాయి. దీంతో పాటు పలురకాల పార్కు నిర్మాణాల ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవలసి ఉంది. నేడు జరుగుతున్న జిల్లా అభివృద్ధి మండలి సమావేశంలో అయినా సమగ్ర చర్చతో జిల్లా అభివృద్ధి బాటలో పయనిస్తుందేమో చూడాలి.

విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

విద్యుత్ షాక్‌తో బేల్దారి మేస్త్రీ తీవ్రంగా గాయపడిన ఘటన మండల పరిధిలోని ఇసుక దర్శి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పంగులూరు మండలం ముప్పవరం గ్రామానికి చెందిన బేల్దారి మేస్త్రీ నాయుడు సాంబయ్య ఇసుక దర్శి గ్రామంలోని పాపిశెట్టి సుబ్బయ్యకు చెందిన గృహ నిర్మాణ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆ ఇంటి డాబా కప్పుపై పనిచేస్తున్న సాంబయ్య అదే ఇంటి పైనుంచి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ వైర్లకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని గుర్తించిన తోటి కూలీలు అప్రమత్తం అవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది కాలిన గాయాలతో తీవ్రంగా గాయపడిన సాంబయ్యను ముందుగా మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు.



గాయపడిన యువకుడు

విశ్రాంత ఉపాధ్యాయుడు నాగయ్య మృతి

ప్రజాశక్తి-పంగులూరు



విశ్రాంత ఉపాధ్యాయుడు, కొండమంజులూరు గ్రామస్తులంతా గ్రామ గురువుగా భావించే, సందిపాగు నాగయ్య(86) ఆదివారం కొండమంజులూరులోని ఆయన స్వగృహంలో మృతిచెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఆదివారం మరణించగా, సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. నాగయ్య భార్య రిటైర్డ్ టీచర్ నవీనమ్మ, నాలుగు సంవత్సరాల క్రితమే మరణించారు. నాగయ్యకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా, పెద్ద కుమార్తె రెబ్బవరపు శేష కుమారి, మండలంలోని ముప్పవరం గ్రామంలో, ఏఎన్ఎంగా పనిచేస్తోంది. రెండో కుమార్తె పోతిపోగు హెప్సిబా, అద్దంకి పట్టణంలో హెూలీ ఫెయిత్ విద్యాసంస్థను నడుపుతోంది. మూడో కుమార్తె ఎడ్లపల్లి రజిని కుమారి, గుంటూరు జిల్లా తిమ్మాపురంలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. కుమారుడు సందిపాగు తియోఫిలాస్, తంగేడుమల్లిలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తుండగా, ఆయన భార్య కవిత మురికిపూడి గ్రామంలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. మృతి చెందిన నాగయ్య పార్థివ దేహాన్ని పలువురు బంధువులు, నాయకులు సందర్శించారు. ఆయన మృతికి నివాళులర్పించారు. ఆయన దగ్గర విద్య నేర్చుకున్న అనేకమంది పూర్వ విద్యార్థులు, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

బిసిలు బ్యాక్ బోన్ లాంటి వారు: రావి

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరు స్థానిక వైసిపి కార్యాలయంలో జయహో బిసి మహాసభ పోస్టర్‌ను పర్చూరు నియోజక వర్గ వైసిపి ఇన్‌ఛార్జి రావి రామనాథం బాబు ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు చుండూరి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 7వ తేదీన విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగే వైసిపి జయహో బిసి మహాసభ గర్జనకు నియోజక వర్గంలో బిసి నాయకులు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. రావి రామనాథం బాబు మాట్లాడుతూ బిసీలు అంటే వెనకబడిన కులాలు మాత్రమే కాదని సమాజానికి వెన్నుముక లాంటివారని కొనియాడారు. అదేవిధంగా గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బిసిల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి కార్పొరేషన్ కింద డైరెక్టర్లను నియమించారని తెలిపారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికలకు జగన్మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో మండల కన్వీనర్లు కఠారి అప్పారావు, బండారు ప్రభాకర్‌రావు, దండా చౌదరి, పఠాన్ కాలేషావలి, వై హరిప్రసాద్, నీరుకట్టు వాసు బాబు, భవనం శ్రీనివాసరెడ్డి, కొల్లా సుభాష్‌బాబు పాల్గొన్నారు.

సచివాలయాలపై దృష్టి సారించాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గ్రామ, వార్డు సచివాలయాల తనిఖీలపై అధికారులు ప్రత్యేక దష్టిసారించాలని జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అర్జీల ద్వారా తమ సమస్యలను కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. అర్జీదారుల సమస్యలను సావధానంగా విన్న కలెక్టరు తన పరిధిలోని వాటికి తక్షణమే పరిష్కార మార్గం చూపారు. కొన్నింటిని పరిశీలించి, మరికొన్నింటిని విచారించాలని అదేశించారు. మిగిలినవి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని కలెక్టరు స్పష్టం చేశారు. స్పందనలో వచ్చే అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సచివాలయాల తనిఖీల్లోనూ ఇదే అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయా మండలాలకు నియమితులైన ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలన్నారు. వారంలో రెండు పర్యాయాలు తమకు కేటాయించిన మండలాలలోని సచివాలయాలను విధిగా తనిఖీలు చేయాలన్నారు. ఆ సచివాలయంలో లోపాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలన్నారు. అధికారులు మిషన్ మోడ్‌తో పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యం భవనాల స్థితిగతులపై పరిశీలన జరపాలన్నారు. ప్రభుత్వ భవనాలు వేగంగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిధులు ఉన్నప్పటికీ పనులలో జాప్యం జరగడం ఏమిటని పలువురు అధికారులను కలెక్టర్ నిలదీశారు. రూ.1.23 కోట్లు నిధులు ఉన్నప్పటికీ అధికారులు సంబంధిత గుత్తేదారులకు కేటాయించకపోవడంపై కలెక్టర్ ప్రశ్నించారు. అలాగే జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు తమ గృహ నిర్మాణాలను త్వరగా నిర్మించుకునేలా చేయూత ఇవ్వాలన్నారు. లబ్ధిదారులను చైతన్యపరిచి వారి సొంత ఇంటి కలను నేరవేర్చే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం అధికారులంతా చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టరు కె శ్రీనివాసులు, డిఆర్‌ఒ కె లక్ష్మీశివజ్యోతి, సిపిఒ జి భరత్, ఆర్‌డిఒ జి రవీందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మా సమస్యలు పరిష్కరించండమ్మా.. చేతులు జోడించి కలెక్టర్‌ను వేడుకుంటున్న వృద్ధురాలు



ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయులు సోమవారం బాపట్ల డిఇఒ కార్యాలయం ఎదుట మెరుపు ధర్నా నిర్వహించారు. ప్రమోషన్లు ఇచ్చి బదిలీలలో ప్లేస్‌మెంట్ ఇస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు బదిలీల ప్రస్తావన లేకుండా వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో సర్దుబాటు చేస్తున్నారని యూటీఎఫ్ నాయకులు విమర్శించారు. టీచర్లను దూర ప్రాంతాలకు డిప్యుటేషన్ వేస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. నేటి వరకు 26 జిల్లాలలో ఉపాధ్యాయులకు జీతాలు అందలేదని పేర్కొన్నారు. ఎఫ్ఎ-2 పరీక్షల అసంబద్ధ నిర్వహణపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు జడ వినయ్ కుమార్, ఉపాధ్యక్షులు బి బిక్షాలబాబు కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి సురేష్, ఆడిట్ కమిటీ సభ్యులు బాపయ్య, కోటేశ్వరరావు, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

క్రీడల్లో గురుకుల విద్యార్థుల విజయం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

క్రీడల్లో బాపట్ల గురుకుల పాఠశాల విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారు. ఈ సందర్భంగా బాపట్ల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలో సోమవారం అభినందన సభ జరిగింది. వివిధ రంగాలలో విద్యార్థినులు జాతీయ స్థాయి బేస్‌బాల్‌లో రజక పతకాలు సాధించిన కే రోజా, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయిలో కబడ్డీ గేమ్‌లో తొమ్మిది మంది, స్కిప్పింగ్‌లో నలుగురు, చెస్‌లో ముగ్గురు, సాఫ్ట్‌బాల్‌లో ఏడుగురు, రెజ్లింగ్‌లో ఇద్దరు, షటిల్ బ్యాడ్మింటన్ ఇద్దరు, హ్యాండ్ బాల్ ఇద్దరు, త్రో బాల్ ఇద్దరు, కబడ్డీ ఇద్దరు, కోకో ముగ్గురు, యు గోలో నలుగురు ఎంపికైనరు. ఏజీ కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాలలో భరతనాట్యం, జానపద గీతాలు, క్విజ్, ఆంగ్ల భాషలో అన్ని రంగాలలో ప్రతిభ చూపించినందుకు, ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించడం జరిగినది. వివిధ రంగాలలో ప్రతిభ చూపిన విద్యార్థినులను ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా సమన్వయ అధికారి జి వెంకట్రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి కె భవాని, పిడి, జి కోటేశ్వరి, పీఈటి సుమతి, మ్యూజిక్ టీచర్ జెఎన్‌పి రమాదేవి, హేమలత, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంఎం కొండయ్య

చంద్రబాబు సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్రాన్ని అంధకారంలో పడేసిన వైసిపి పాలనా విధానాన్ని ప్రశ్నిస్తూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 10వ తారీఖున చీరాలకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తున్నారని, ఆయన ప్రచారాన్ని విజయవంతం చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం స్థానిక గడియార స్తంభం సెంటర్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా రోడ్ షో నిర్వహించనున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనుసరిస్తున్న విధానాన్ని ఖండిస్తూ చంద్రబాబు చీరాలకు వస్తున్నారు. ప్రతిఒక్కరూ ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు. నియోజకవర్గంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు అందరూ అధిక సంఖ్యలో హాజరై ప్రచారాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట టిడిపి నాయకులు కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమం కోసం చేయూత

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

దేశభద్రత కోసం ప్రాణాలను పణంగా పెట్టి నిరంతరం కాపలా కాస్తున్న సైనికులు, మాజీ సైనికులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా సంయుక్త కలెక్టరు డాక్టర్ కె శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 7వ తేదీన నిర్వహించే సాయుధ దళాల పతాక దినోత్సవం (ఫ్లాగ్ డే) సందర్భంగా సైనిక సంక్షేమ శాఖ రూపొందించిన బ్రోచర్, స్టిక్కర్లను జిల్లా సంయుక్త కలెక్టరు విడుదల చేశారు. మాజీ సైనికుల సంక్షేమం కోసం మార్చి వరకు విరాళాల సేకరణ జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ క్రమంలో నూతనంగా ఏర్పడిన జిల్లా అధికారుల సంఘం వెంటనే స్పందించి రూ.10 వేలు సైనిక సంక్షేమ నిధికి విరాళంగా ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా అధికారుల సంఘం నాయకుడు డిఆర్‌డిఏ పిడి బి అర్జునరావు, ఆర్‌డిఒ జి రవీందర్, సిపిఒ జి భరత్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్ గుణశీల తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో ఎంవిఐ తనిఖీ కార్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రేపల్లె: బాపట్ల జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ కేంద్రాలైన చీరాల, బాపట్లలలో మోటార్ వాహనాల తనిఖీ అధికారి కార్యాలయాలు కలవు. కానీ నూతనంగా ఏర్పడిన రెవెన్యూ డివిజనల్ కేంద్రమైన రేపల్లెలో, మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయము" ఏర్పాటు చేయాలని రేపల్లె పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సివి మోహనరావు కోరారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ జగన్నాథం పార్థసారథికి వినతిపత్రం అందించారు. రేపల్లె రెవెన్యూ డివిజనల్ పరిధిలోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఉన్న టూ వీలర్స్, ఆటోలు, జీపులు, ట్రాక్టర్లు, మినీ లారీలు, లారీలు, పాఠశాలలకు, ఆర్టీసీకి చెందిన బస్సులు, కార్లు, వగైరాలు సుమారుగా 7,000 వాహనాలు ఉన్నాయి. ఫిట్నెస్ సర్టిఫికెట్, వాహన వెరిఫికేషన్ ఉన్న లైసెన్సులలో అదనపు వివరాలు చేర్చేందుకు, నూతనంగా ఎల్ఎల్ఆర్ లైసెన్స్ లు, డ్రైవింగ్ లైసెన్సులు కోసం, వేరే రెవెన్యూ డివిజన్‌కు చెందిన 'బాపట్లకు' వెళ్లవలసివస్తోంది.

స్పందన ఫిర్యాదులను గడువులోపు పరిష్కరించాలి: ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని, లేనట్లయితే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ చెప్పారు. జిల్లా ఎస్‌పి సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. పిటీషన్లకు చట్టపరిధిలో పరిష్కారం చూపేలా సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్పందన కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలు, ఇతర సమస్యల గురించి 56 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలు విన్నవించుకున్నారని, వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు పంపడం జరిగిందని ఎస్‌పి తెలిపారు. ఈ స్పందన కార్యక్రమంలో స్పందన సెల్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ ఎం మురళీకృష్ణ పాల్గొన్నారు.

వెదుళ్లపల్లి పాఠశాల స్థలాన్ని కాపాడండి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల జిల్లా వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలాన్ని కాపాడాలంటూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ సోమవారం గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్ పర్సన్ హెన్రీ క్రిస్టినాను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు పలు విషయాలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, మనోజ్ కుమార్, ఆర్య మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం, గ్రామంలోని విద్యార్థుల భవిష్యత్తు కోసం పాటుపడాల్సిన పెద్దలే పేద విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాల అభివృద్ధిని అడ్డుకోవడం తగదని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా చైర్ పర్సన్ విచారం వ్యక్తం చేశారు. అత్యవసరంగా, ప్రత్యక్షంగా పాఠశాలను సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కార్యదర్శి కిరణ్, జిల్లా అధ్యక్షుడు బాలాజీ, ఉదయ్, రూపస్ పాల్గొన్నారు.

బీసీ నిధులు దుర్వినియోగం చేయొద్దని వినతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి: బీసీ కార్పొరేషన్ నిధులను ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని, వాటిని బీసీల అభివృద్ధికి ఖర్చు చేయాలని రాష్ట్ర టిడిపి బీసీ సెల్ ఉపాధ్యక్షుడు దీవి రాంబాబు అన్నారు. రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్య ప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం తహశీల్దారు కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ నిధులన్నీటిని దారి మళ్లించి వేరే పథకాలకు ఖర్చు చేస్తుందని, ఈ విధానాన్ని మార్చి బీసీల అభివృద్ధికి ఖర్చు చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దారు కార్యాలయ సిబ్బందికి వినతి అందజేశారు. తెలుగు యువత ఉప్పాల సాంబ శివరావు, మల్లాది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో బాలికల విజయం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్లలో జరిగిన యువజన ఉత్సవాలలో ప్రభుత్వ బాలికల విద్యార్థులు వివిధ పోటీలలో పాల్గొని బహుమతులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ వేదవతి తెలిపారు. పెయింటింగ్‌లో ద్వితీయ బహుమతి ఎండి ముమీనా, చిత్రలేఖనంలో ద్వితీయ బహుమతి ఎస్‌కె గ్రేస్, పాటల పోటీలో ద్వితీయ బహుమతి డి శృతి, మోడ్రన్ డాన్స్‌లో తృతీయ బహుమతి ఎస్‌కె జాస్మిన్, మోనో యాక్షన్‌లో తృతీయ బహుమతి డి తులసిలక్ష్మి సాధించారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పిడి వై ఉదయ్ భాస్కర్, ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కారంచేడు

వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నవారికి రూ.28,31,000 విలువైన 42 చెక్కులను రావి రామనాథం బాబు పంపిణీ చేశారు. సోమవారం నాడు స్థానిక పర్చూరు వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసు బాబు, జడ్పిటిసి యార్లగడ్డ రజిని, మండల వైసీపీ నాయకులు దండ చౌదరి బాబు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన డ్రీమ్స్ కళాశాల విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు 'డ్రీమ్స్' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఒంగోలు మినీ స్టేడియంలో అండర్-19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక జరిగింది. ఇంకొల్లు మండలం పూసపాడు డ్రీమ్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు షేక్ మహబూబ్ రబ్బానీ, సీహెచ్ బంగారు, ఆర్ నాగశ్రీనుబాబు, జి రాఘవాదిత్య ఎంపికయ్యారు. ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా పక్షాన ఆడనున్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం పేర్ని రాధాకృష్ణమూర్తి (ఆర్.కె), పేర్ని సతీష్‌చంద్ర, వ్యాయామోపాధ్యాయులు నాగమల్లేశ్వరరావు, రవి, అంకమ్మబాబు, ప్రసాద్, కరుణ, లక్ష్మీబాయి అభినందించారు.

కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో ఇంకొల్లు మండలం పూసపాడు యూనివర్సల్ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గుంటూరు జిల్లా జట్టులో ఆడి ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కె కళ్యాణ్, టి జితిన్‌లను యాజమాన్యం పేర్ని రాధాకృష్ణమూర్తి (ఆర్‌కె), పేర్ని సతీష్‌చంద్ర, పిఇటి మల్లేశ్వరరావు, రవి, అంకమ్మబాబు, ప్రసాద్, లక్ష్మీబాయి, కరుణలు విద్యార్థులను అభినందించారు.

తప్పుడు నివేదికలు రూపొందించి ..

- నాయకుల జేబులు నింపుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు
- ఏళ్ల తరబడి పరిష్కారం కాని తాగునీటి సమస్య
- నిరుపయోగంగా పైపు లైన్లు
- శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంకులు



గొల్లపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు



నిరుపయోగంగా ఉన్న ఫిల్టర్ బెడ్లు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

గ్రామాలలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ప్రభుత్వాలు ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్నాయి. స్థానిక నాయకులు గుత్తేదారులకు లబ్ధి చేకూర్చే విధంగా ఇంజినీర్లను ప్రలోభాలుకు గురి చేసి ఆచరణకు సాధ్యంకాని ప్రణాళికలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపుతున్నారు. ఉన్నతాధికారులు క్షేతస్థాయి సిబ్బంది చెప్పిందే నిజమని నమ్ముతున్నారు. ఆదిశగా తనిఖీలు నిర్వహించకుండానే తాయిలాలు అందుకొని నాయకులకు వంతపాడుతూ ప్రజల దాహర్తీ గురించి పట్టించుకోవడం లేదు.

మండల పరిధిలోని గొల్లపల్లి వద్ద 34 గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు రక్షిత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. నాయకులు సంపాదన కోసం ఆ పథకాన్ని నీరు గార్చారు. ఈ పథకం ద్వారా పట్టుమని పది గ్రామాలకు కూడా నీరు అందిస్తున్న పాపాన పోలేదు. ప్రభుత్వం ఈ పథకం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది.అధికారులు మాత్రం గత 15 సంవత్సరాలుగా ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తూ నాయకులను కుబేరులుగా చేస్తున్నారు. తమ జేబులు నింపుకుంటున్నారు. గతంలో గొల్లపల్లి ఎస్ఎస్ ట్యాంకు నుంచి విశ్వనాథపురం మీదుగా లేళ్లపల్లి, దువ్వలి, చెర్లోపల్లి గ్రామాలను కలుపుతూ పైపులైన్ ద్వారా నీటి సరఫరా కోసం పైపులైన్ ఏర్పాటు చేశారు. గొల్లపల్లి విశ్వనాథపురానికి ఎగువన ఉండటంతో నీరు సరఫరా కాలేదు. అధికారులు ఆ పైపులైన్ గురించి మరచిపోయారు.



నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు

పుల్లలచెరువు మండలం ముటుకుల సమ్మర్ స్టోరేజీ నుంచి చెన్నంపల్లి మీదుగా మిట్టపాలెం, రామసముద్రం, అయ్యంబొట్లపల్లి గ్రామాలకు పైపులైన్ ఏర్పాటు చేశారు. ఆ గ్రామాలలో ఓవర్ హెడ్ ట్యాంకులు కూడా నిర్మించారు. అయితే ఓవర్ హెడ్ ట్యాంకులకు చుక్కనీరు సరాఫరా కాలేదు. దీంతో ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. లేళ్లపల్లి, దువ్వలి, చెర్లోపల్లి, మిట్టపాలెం, రామసముద్రం, అయ్యంబొట్లపల్లి గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. రామసముద్రం గ్రామస్తులు తమ గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ, రామకృష్ణ, ఎఇ హనుమాన్ బాబు త్రిపురాంతకం నుంచి రామసముద్రం గ్రామానికి తాగునీటిని సరఫరా చేసేందుకు రూ. 4.80 కోట్లతో బడ్జెట్ రూపొందించారు. తర్వాత ప్రభుత్వం నుంచి నిధులు వస్తే తప్ప పనులు ప్రారంభించలేమని చేతులు ఎత్తేశారు. మండల పరిధిలోని ఆరు గ్రామాలకు గాను ప్రతిరోజూ 40 ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గుత్తేదారులకు రోజుకు రూ. 1.20 లక్షలు చెల్లిస్తున్నారు. ఆరు గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు అధికారులకు చిత్తశుద్ధి ఉంటే గొల్లపల్లి నుంచి విశ్వనాధపురం వద్ద సంపు నిర్మాణం చేపట్టి మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తే విశ్వనాధపురం నుంచి లేళ్లపల్లి, దువ్వలి, చొర్లోపల్లి వరకు ఉన్న పాత పైపులైన్ ద్వారా నీటిని అందించవచ్చు. అదేవిధంగా లేళ్లపల్లి నుంచి రామసముద్రం వరకు కొత్త పైపులైన్ నిర్మాణం ఏర్పాటు చేస్తే మిట్టపాలెం, రామసముద్రం, అయ్యంబొట్లపల్లి గ్రామాల్లో ఉన్న పాత పైపులైన్‌ను వినియోగంలోకి తీసుకురావచ్చు. సంపు నిర్మాణానికి రూ. 8 నుంచి రూ. 10 లక్షలు, మోటార్లకు రూ. 5 నుంచి రూ. 7 లక్షలు, పైపులైన్ నిర్మాణానికి రూ. 5 నుంచి 8 లక్షలు కలిపి మొత్తం రూ. 25 లక్షల వ్యయంతో ఈ ఆరు గ్రామాల ప్రజల దాహార్తి తీర్చవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ స్వార్ధ ప్రయోజనాలు వీడి ప్రభుత్వ ధనం దుర్వినియోగం కాకుండా ప్రజల దాహార్తిని తీర్చాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

నిధులు లేకుండా పనులు చేపట్టడం సాధ్యం కాదు

డి. రామకష్ణారావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ

వాటర్ గ్రిడ్ ద్వారా రూ.1,100 కోట్లు రూపాయలతో టెండర్లు పిలిచాం. యర్రగొండపాలెం నియోజకవర్గానికి రూ.340 కోట్ల రూపాయలు కేటాయించి టెండర్లు పిలిచాం. త్వరలో గుత్తేదారులకు పనులు అప్పగిస్తాం. అయితే ఏ పనులు చేపట్టాలన్న నిధుల కొరత సమస్యగా ఉంది. నిధులు లేకుండా పనులు చేపట్టడం సాధ్యం కాదు.



ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-వెలిగండ్ల

మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి, కనీస వేతనాలు ఇవ్వాలని కోరతూ స్థానిక విద్యావనరుల కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి రాయల మాలకొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్యను పెంచడానికి పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యాలతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని ప్రారంభిం ఇన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. మార్చిన మెనూలో హాట్ పొంగలి, సాంబార్ బాతు, ఆకు కూరలను పిల్లలు ఇష్టంగా తినటం లేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. ప్రతినెల 5వ తేదీ లోపు వేతనాలు బిల్లులు ఇవ్వాలన్నారు. అనంతరం కంప్యూటర్ ఆపరేటర్ బీరం గోవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యర్శులు సోము రాధ, బుర్రా రత్తమ్మ, కమిటీ సభ్యులు చిలంకూరి వేగమ్మ, మల్ల తిరుపతమ్మ, నాగమ్మ, ఆదిలక్షమ్మ, అనంతలక్ష్మి, మస్తాన్‌బి, వెంకట లక్షమ్మ, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిన పాలకులు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -పిసిపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం గురించి నిత్యం జపించడం తప్ప ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యహరిస్తుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఈనెల 8,9,10 తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండల పరిధిలోఇన గుంటుపల్లి, బట్టుపల్లి గ్రామాల్లో సోమవారం ప్రచార జాతా నిర్వహించారు. అందులో భాగంగా పిసిపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం జెండాను సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కనీసం తాగునీరు కూడా అందించలేని పాలకుల నిర్లక్ష్యం వల్ల మండలంలో కిడ్నీ రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నట్లు తెలిపారు. డయాలసిస్ పేషెంట్లు సంఖ్య పదుల సంఖ్యలో ఉందన్నారు. ప్రజల యొక్క ఆరోగ్య స్థితులు దిగజారి పోవడానికి పాలకుల విధానాలే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు, జనార్ధన్, వజ్రాల చెన్నయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న కంకణాల ఆంజనేయులు



డిప్యూటీ తహశీల్దారుకు రైతుల వినతి

భూహక్కు కల్పించాలని వినతి

గిద్దలూరు రూరల్ : గత 25 సంవత్సరాలుగా తాము సాగు చేసుకుంటున్న భూమికి భూ హక్కు కల్పించాలని డిప్యూటీ తహశీల్దార్ ఆర్‌వి.ప్రసాద్‌కు కొత్తకోట గ్రామ రైతులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తకోట గ్రామ రెవెన్యూ ఇలాకాలోని సర్వే నం.510, 557 ,558 లో దాదాపు 105 ఎకరాల విస్తీర్ణంలో 30 కుటుంబాల రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు.ఆ భూమికి డికె పట్టా, పట్టాదారు పాస్‌పుస్తకం ఇచ్చి ఆన్‌లైన్ నమోదు చేసి భూహక్కు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు రంపేరు రమణమ్మ, రంపేరు ఆదిగంగయ్య, షేక్ హుస్సేన్, అంకాల బాలఅంకమ్మ, చిర్రబోయిన లక్ష్మి, గంగాదేవి ,ఎస్‌కె.కాశింబి, లక్ష్మి పాల్గొన్నారు.

వాలంటీరు తొలగింపు

మార్కాపురం రూరల్ : మండల పరిధిలోని గొట్టిపడియ గ్రామ వాలంటీరు తుమ్మ శ్రీనివాసరెడ్డిని విధుల నుంచి తొలగించారు శ్రీనివాసరెడ్డి మద్యం తాగి విధులకు హాజరు కావటం, ప్రజలపై దరుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. పద్ధతి మార్చుకోవాలని పంచాయతీ కార్యదర్శి పలు మార్లు శ్రీనివాసరెడ్డిని హెచ్చరించాడు. అయినప్పటికీ ఫలితం లేకపోవంతో ఎంపిడిఒ తోట చందన వాలంటీర్‌ను తుమ్మ శ్రీనివాసరెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

10న క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు కలెక్టరేట్ : ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -19 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ కార్య నిర్వాహక కార్యదర్శి మసనం ఆదినారాయణ రావు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరులోని టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో అండర్-19 క్రికెట్ బాలురు, బాలికల ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2004 జనవరి ఒకటవ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. టెన్త్ మార్కుల జాబితా, ఆధార్ కార్డు ఒరిజినల్ తో ఈనెల 10న ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ఆదినారాయణ కోరారు.

వైసిపి పాలనలో ప్రజలపై భారాలు

మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలోని 14,15 వార్డుల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఇంటింటికీ తిరిగి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్ర మానికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. వైసిపి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతుందని విమర్శించారు. వైసిపి దుర్మార్గపు పాలనలో నిత్యవసర వస్తువుల నుంచి ప్రతి వస్తువుల ధరలు సామాన్యులు బరాయించలేని విధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, పొదిలి మండల, పట్టణ టిడిపి అధ్యక్షులు మీగడ ఓబుల్ రెడ్డి, ముల్లా ఖర్దూస్, మాజీ జడ్‌పిటిసి కాటూరి నారాయణ బాబు, మాజీ సర్పంచి కాటూరి నారాయణ ప్రతాప్, టిడిపి నాయకులు యర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, శామంతపూడి నాగేశ్వరరావు, బాషా, షబ్బీర్, మౌలాలి, జ్యోతి మల్లి కార్జునరావు, ఠాగూర్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ రక్షణకు ఉద్యమిద్దాం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-పామూరు

పాలకులు వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని, వ్యవసాయ రంగాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని ప్రచార జాతా పామూరు చేరింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలో నుంచి బయటకు తెస్తామని మోడీ పలికిన మాటలన్నీ నీటి మీద రాతలయ్యాయని ఆయన అన్నారు. శనగ పంటకు దిగుబడివచ్చే సమయంలోనే ప్రభుత్వం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదని దీనితో దేశంలో రైతులు నష్టపోతున్నారని అన్నారు. కరువు కాలంలో కాస్తో, కూస్తో పేదలకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిధులు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నదని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడీ అనుసరిస్తున్న విధానాలను ప్రశ్నించకపోగా రాష్ట్రంలోని పాలకులు, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు మౌనం పాటించటం విచారకరమని అన్నారు. ఈ జాతాలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వై వీరనారాయ, సిఐటియు మండల కార్యదర్శి కొమ్మాలపాటి మాల్యాద్రి, ప్రజాసంఘాల నాయకులు అల్లాబక్షు, బత్తుల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. **వెలిగండ్ల :** వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ఈనెల 8,9,10 తేదీలలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరుగుతున్న నేపథ్యంలో మహాసభలను జయప్రదం చేయాలని నిర్వహిస్తున్న జీబుజాతా వెలిగండ్లకు వచ్చిన సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ 2005లో వ్యవసాయ కార్మిక చట్టం వచ్చినప్పటి నుంచి ఇప్పటికి రైతులకు, కూలీలకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. బడా పెట్టుబడిదారులకు వ్యవసాయ ఉత్పత్తులను అడ్డగోలుగా కట్టబెడుతూ రైతులకు కూలీలకు గిట్టుబాటు ధర లేక అన్నమో రామచంద్ర అని గగ్గోలు పడవలసి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మికసంఘం సహాయ కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు, మండల సిఐటియూ కార్యదర్శి రాయల మాలకొండయ్య పాల్గొన్నారు. **కనిగిరి :** దేశం,రాష్ట్రంలో ఆహార భద్రతాచట్టం అమలు చేయటంలో పాలకులు విఫలమయ్యారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు తెలియజేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రమహాసభల ప్రచారజాత కనిగిరికి వచ్చిన సందర్భంగా జాతాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వ్యవసాయకూలీల స్థితిగతులు రాష్ట్రంలో అత్యంత దారుణంగా ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు,బడుగు వెంకటేశ్వర్లు,పి పురుషోత్తం,జి ఏసోబు తదితరులు పాల్గొన్నారు.


జాతాలో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

ధరలు పెరిగిన కారణంగా గృహ నిర్మాణానికి కనీసం రూ. 5లక్షలు కేటాయించాలని జగనన్న గృహాల లబ్ధిదారులు తెలిపారు. మండల కేంద్రంలోనిలబ్ధిదారులు మండల సీపీఐ, సిపిఎం వామ పక్ష పార్టీ నాయకులతో కలసి సోమవారం మండల తహశీల్దార్ వి కిరణ్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీలోని లబ్ధిదారుల ఒక్కొక్క గహానికి రూ. 1.80లక్షలు కేటాయించడం జరిగిందని, ఇటుక, ఇసుక, ఇనుము నిర్మాణ కూలి రేట్లు అధికంగా పెరిగిన కారణంగా ఆవి ఏమాత్రం సరిపోవడం లేదని వారు వాపోయారు. సిపిఎం మండల కార్యదర్శి జి రాజరామయ్యా మాట్లాడుతూ కాలనీలు మండల కేంద్రానికి దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో వున్నందున గృహ నిర్మాణానికి కావాల్సిన సామాగ్రిని తెచ్చుకునేందుకు రవాణా భారం అధికంగా పడుతుందని, ప్రభుత్వం స్పందించి గృహ నిర్మాణ వ్యయాన్ని పెంచాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి డి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో చెప్పినట్లుగా లబ్ధిదారుల ఎంపికలో మూడవ అప్షన్ ద్వారా నిరు పేదలైన లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రములో సీపీఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య జగనన్న లబ్దిదారులు పాల్గొన్నారు.


వినతి పత్రాన్ని అందజేస్తున్న వామపక్ష నాయకులు

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొనకనమిట్ల

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. కొనకనమిట్ల గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలందరూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని తెలిపారు. తొలుత పోలేరమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో జాతీయ రహదారి పక్కన ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి మోరబోయిన మురళీకష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, వైసిపి మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, తహశీల్దారు ప్రసాద్‌రావు, ఎంపిడిఒ రావూరి జనార్ధన్, ఎపిఎం కె.గోపాలకష్ణారెడ్డి, నాయకులు సురవరపు వెంకటరెడ్డి, కళ్లం దిబ్బారెడ్డి, కొండారెడ్డి, యక్కంటి తిరుపతిరెడ్డి, పగడాల వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల సర్పంచి వైసిపిలో చేరిక

కొనకనమిట్ల సర్పంచి సిగినం లక్ష్మీతిరుపతమ్మ, 8వ వార్డు సభ్యుడు వసంతపురం రామయోగులు మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి సమక్షంలో సోమవారం వైసిపిలో చేరారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తాము వైసిపిలో చేరినట్లు వారు తెలిపారు. అదేవిధం సిగినం ఏడుకొండలు మరి కొంతమంది వైసిపిలో చేరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి

క్రీడా వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఒంగోలు నెహ్రూ యువ కేంద్రం, జిల్లా యవజన అధికారి కమల్‌షా ఆధ్వర్యంలో నేషనల్ యూత్ వాలంటీర్ తూమాటి సుబ్బారాయుడు సోమవారం యర్రగొండపాలెంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు క్రికెట్, షటిల్, పుట్‌బాల్, వాలీబాల్ కిట్‌లను అందజేశారు. ఈ సంధర్భంగా ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి రామకోటయ్య మాట్లాడుతూ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో అందజేసిన క్రీడా వస్తువులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు ఆనందాన్ని ఇస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకులు పి ప్రదీప్, ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ డి తిరుపతయ్య, భౌతిక శాస్త్ర అధ్యాపకులు వికెఎస్ శ్రీనివాస్, కామర్స్ అధ్యాపకులు డాక్టర్ విజయనాయక్, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఏ రాజు, గణితశాస్త్రం అధ్యాపకులు రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దోర్నాలకు అఖిత భారత రైతుజాతా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అఖిల భారత రైతు జాతా ఈ నెల ఆరో తేదీన దోర్నాలకు రానుంది. అఖిల భారత రైతు మహాసభలు ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోజరుగుతున్నాయి. ఈ మహాసభల సంధర్భంగా తెలంగాణ రాష్ట్రంలో జనగాం తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమరయ్య స్తూపం నుంచి జాతా ప్రారంభమై.. పల్నాడు జిల్లా మీదుగా ఆరో తేదీ మధ్యాహ్నానికి దోర్నాల చేరుకుంటుంది. ఈ జాతాలో అఖిలభారత రైతు సంఘం జాతీయ సహాయకార్యదర్శి కృష్ణప్రసాద్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సాగర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అద్యక్షుడు వి.కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు పాల్గొని సందేశం ఇస్తారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జాతాను జయప్రదం చేయాలని రైతుసంఘం నియోజకవర్గ కార్యదర్శి దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి కోరారు.

భూములకు హద్దులు చూపించండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని సర్వే నెంబర్ 539/1లో 2013వ సంవత్సరంలో చెంచు గిరిజనులకు కేటాయించిన భూములకు హద్దులు చూపించాలని కోరుతూ వెంకటలక్ష్మి గూడెం విటిడిఏ ప్రెసిడెంట్ భూమని వెంకటేశం ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కె. రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంచుగిరిజనులకు కేటాయించిన భూములను వారికి చెందినవి కావని, కొందరు అడ్డుపడుతున్నారని ఆయన తెలిపారు. చెంచుగిరిజనులకు స్థలాలు ఇవ్వాలని కోరితే ఖాళీ లేదని చెప్పారని, తీరా ఇచ్చిన భూములకు ఇలా అడ్డుపడుతున్నారని ఆయన వాపోయారు. ఇకనైనా అధికారులు చొరవచూపి చెంచు గిరిజనులకు కేటాయించిన భూములకు సంబంధించి హద్దులను చూపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద నాగమణి, అంజమ్మ, చిన్న నాగమణి, గురవయ్య, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సోమవారం బాపట్ల కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆచార్య రంగా యూనివర్సిటీ బాపట్ల కాలేజీల కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా బాపట్లలోని అగ్రికల్చర్ కాలేజీ, ఫుడ్ సైన్స్, బిటెక్ కాలేజీల్లో, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని, వీరికి కనీస వేతనాలు అమలు చేయట్లేదని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులను 10 సంవత్సరాలలోపు సర్వీస్ వాళ్లను తొలగిస్తామని చెప్పి జిఓ ఇవ్వటం దారుణమని అన్నారు. అన్ స్కిల్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన కనీస వేతనం కూడా ప్రభుత్వ కాలేజీల్లో అమలు జరగకపోవడం దారుణమని వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఓ లక్ష్మీనారాయణ, రాజశేఖర్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె మండలంలోని పెనుమూడి రోడ్డులోని బొమ్మరిల్లు రెస్టారెంట్ వెనుక పంటపొలాల్లో పచ్చిక మేస్తూ విద్యుత్ షాక్‌కు గురై ఓ గేదె మృతి చెందింది. రైతు కారుమూరు పుష్పావతి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రధాన రహదారి పక్కనే విద్యుత్ శాఖ వారు అడుగున్నర ఎత్తులో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు ప్రమాదకర స్థాయిలో ఉన్నాయన్నారు. యధావిధిగా తన పశువులను ఉదయం పచ్చిక మేయడానికి వదలడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరుకు రుద్దుకోవడంతో విద్యుత్తు వైర్లు తగిలి సంఘటన స్థలంలోనే గేదె మృతి చెందిందని వాపోయారు. దీంతో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని ఆమె ఆవేదన చెందారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను పరిష్కరించాలని అధికారులకు రెండు సంవత్సరాలుగా కోరుతున్నా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రమాదం జరిగిందని గ్రామస్తులు అంటున్నారు. పాడిపైనే జీవనాధారం సాగించే తన కుటుంబం ఆధారం కోల్పోయిందని, విద్యుత్ శాఖ, ప్రభుత్వం సంయుక్తంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమృతలూరు

వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలు జంగారెడ్డిగూడెంలో డిసెంబర్ 7,8,9,10 తేదీల్లో జరుగుతున్న సందర్భంగా సోమవారం అమృతలూరులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి అగస్టీన్ మాట్లాడుతూ. పుచ్చలపల్లి సుందరయ్య దేశంలోనే మొట్టమొదట 1934లో స్థాపించిన సంఘమని, అది దిన దినాభివృద్ధి చెంది అఖిల భారత సంఘంగా అవతరించిందని అన్నారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మికుల సమస్యలపై అనేక తీర్మానాలు చేయబోతున్నారని, 8వ తేదీన జరిగే బహిరంగ సభలో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏ విజయ్ రాఘవన్, బి వెంకట్ పాల్గొంటున్నారని, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అగస్టిన్ కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి వడ్డేశ్వరపు అమృతరావు, దావీదు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాంకేతికతను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-అద్దంకి

రైతులు ఆధునిక సాంకేతికతను అలవర్చుకొని వ్యవసాయంలో మెలకువలు నేర్చుకొని వ్యవసాయంలో అధిక దిగుబడులు పొందాలని ఆచార్య ఎన్‌జి రంగా యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసర్చ్ డాక్టర్ ఎల్ ప్రశాంతి రైతులకు తెలియజేశారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన గుంటూరులోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీలో జరిగిన ఏపీ అగ్రిటెక్ ప్రదర్శనకు అద్దంకి నియోజకవర్గంలోని రైతులను సోమవారం ఎగ్జిబిషన్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ రైతులను తీసుకు వెళ్లడం జరిగినది. ఈ కార్యక్రమంలో దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వివిఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నూతన సాంకేతిక వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు వ్యవసాయంలో మెలకువలు నేర్చుకోవాలని రైతులకు సూచించారు. ఈ సదస్సు లో డాక్టర్ ఎం ఉష, డాక్టర్ కే శివ, ముండ్లమూరు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కమ్యూనిటీ మొబైల్ గోపనబోయిన వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న డైరెక్టర్ మాల్యాద్రి

మట్టిని కాపాడుకుందాం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రపంచ మట్టి దినోత్సవం సందర్భంగా ఫ్రీడమ్ బర్డ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'మట్టిని కాపాడే చిట్టి చేతులు' అనే కార్యక్రమాన్ని చిన్నారులతో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాల్యాద్రి, పుష్పేశ్వరి మాట్లాడుతూ చిన్నారులకు మట్టి విశిష్టత గురించి, దాని వల్ల ఆహారం ఎలా వస్తుందనే విషయంపై అవగాహన కల్పించారు. మట్టిని కాపాడటం మనందరి బాధ్యతని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని బురద పాలెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని వైద్యాధికారి ఎస్‌పి బాలయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు ప్రబలుతున్న దష్ట్యా దూరప్రాంతాల నుండి వైద్యశాలకు రావడానికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆ గ్రామములో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎస్‌పి.బాలయ్య 44 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 13 మందికి షుగర్ పరీక్షలు చేసినట్లు తెలిపారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఇఒ అబ్బుల్ జలీల్, హెచ్‌ఎస్ ప్రతాప్, సిహెచ్ కొండల్, ఎఎన్‌ఎం తిరుమలదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ప్రజాశక్తి-అద్దంకి

సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన చీరాల ఆర్‌డిఒ కార్యాలయ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ డి పరిశుద్ధరావు అన్నారు. ఆదివారం బాపట్ల ఏపీ ఎన్జీవో హాల్‌లో సర్వే ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పరిశుద్ధరావును బాపట్ల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆది రామచంద్ర సత్యనారాయణ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సంఘ పరిస్థితులు రాబోయే రోజుల్లో తీసుకునే నిర్ణయాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి ఉద్యోగి సమస్యను తమ సమస్యలుగా తీసుకొని వారి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన సర్వేయర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికె కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

సోమవారం చిన్నగుడిపాడులోని ఆర్‌బికె కేంద్రాన్ని వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ తనిఖీ నిర్వహించారు. తొలుత వర్మీ కంపోస్టు తయారు చేసే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరంలో సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆయన వెంట సేద్రియ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మిడ్‌డే మీల్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎస్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో సోమవారం గిద్దలూరు మండల విద్యావనరుల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్నభోజన కార్మికులకు కనీసవేతనం అమలు చేయాలని, ప్రతినెలా 5వతేదీలోపు వేతనాలు చెల్లించాలని కోరారు. మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు రూ.20లకు పెంచాలని డిమాండు చేశారు. ప్రభుత్వమే గ్యాస్ సరఫరాచేయాలని, రాజకీయ వేదింపులు ఆపాలని, పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని కోరారు. ప్రమాదబీమా సౌకర్యంకల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడి వినతిపత్రాన్నియ ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీకాంత్‌కు అందజేశారు. కార్మికులు తమ సమస్యలను విన్నవించుకుందామని మండల విద్యావనరుల కార్యాలయంకు మధ్యాహ్నం రాగా సాయంత్రం నాలుగు గంటల వరకు కార్యాలయంలో తమ గోడు వినే నాథులే లేరని, మహాకార్మికులం అక్కడ వేచి ఉండి చివరకు కార్యాలయంలో పని చేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్‌కు తమ సమస్యల మెమోరాండం ఇవ్వటం జరిగిందని, వారు ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో మిడ్డే మీల్స్ యూనియన్ కార్యదర్శి ఎ.కుమారి, ట్రెజరర్ టి.నర్సమ్మ, జి.లక్ష్మీదేవి, సిఐటియు నాయకులు టి.ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని మంత్రివర్గం నుంచి తొలగించాలి

ప్రజాశక్తి-టంగుటూరు

రైతు భేరి మహాసభ నిర్వహణకు సిద్ధమైన బీసీ నాయకుడు బోడె రామచంద్ర యాదవ్‌పై రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు చేసిన దాడికి బాధ్యత వహించి పెద్దిరెడ్డిని వెంటనే మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని యాదవ జెఎసి నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. శాంతియుతంగా రైతు భేరి సభకు సిద్ధపడిన నాయకులపై జరిగిన దాడిని నాయకులు తీవ్రంగా ఖండించారు. దాడులతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోవడం అవివేకమని వారు ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు రాయలసీమ బహుజన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి జీ వీరభద్రాచారి, టంగుటూరు మండలం వల్లూరుకు చెందిన యాదవ జేఏసీ రాష్ట్ర నాయకులు చిరుమామిళ్ల గోపికృష్ణ, యాదవ జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు, గిరిజన సంఘం నాయకులు పేరం సత్యం, సిరిమల్లె రాజ్యలక్ష్మి, ఎమ్మార్పీఎస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఒంగోలు నగరానికి చెందిన ముళ్ళమూరి నాగరాణి రెండవ డెలివరి కోసం ఒంగోలు సంఘమిత్ర హాస్పిటల్‌లో చేరింది. కాగా ఆమెను పరీక్షించిన వైద్యులు రెండు కిడ్నీలకు ఇన్‌ఫెక్షన్ వచ్చిందని రూ. 5 లక్షల దాకా ఖర్చవుతుందని చెప్పారు. మెరుగైన వైద్య చికిత్సల కోసం హైదరాబాద్‌లోని అపోలో హాస్పటల్‌కు వెళ్లాలని సూచించారు. ఆర్థిక పరిస్థితుల వలన తన భార్య వైద్య ఖర్చుల కోసం ఆదుకోవాలని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘాన్ని ఆశ్రయించారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చిన్నపల్లి శ్రీనివాసాచారి బాధితులకు సాయం చేయాలని మండలాల వారిగా తెలిపారు. స్పందించిన యర్రగొండపాలెం మండల విశ్వబ్రాహ్మణ సంఘం సోమవారం 91,731లను నాగరాణి చికిత్సల నిమిత్తం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం మండల కన్వీనర్ జెమ్మోజు వెంకటేశ్వరచారి, నాయకులు బాలయోగి, మల్లికార్జునాచారి తదితరులు పాల్గొన్నారు.

'వనిత' ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని వనిత మహిళా శిక్షణా కేంద్రంలో మూడురోజులపాటు మెహిందీలో మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. 100 మందికిపైగా మహిళలు మెహిందీలో శిక్షణ పొందేందుకు హాజరుకావటం జరిగింది. వివిధ రకాల డిజైన్‌లలో మెహంది అలంకారం చేయటం ఎలా అంశంపై శిక్షణ ఇవ్వటం జరిగింది.మహిళలు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని వనిత శిక్షణా కేంద్రం డైరక్టర్ సుమ తెలియజేశారు. శిక్షణ పొందిన మహిళలకు ప్రభుత్వం నుంచి ధృవీకరణ ప్రతం అందించటం జరుగుతుందని పేర్కొన్నారు.



మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్ ఉగ్ర

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-కనిగిరి

అద్దంకి నార్కెట్‌పల్లి హైవేరోడ్డులోని రొంపిచర్ల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కనిగిరికి చెందిన ప్రముఖ వ్యాపారులు చన్నా ప్రసాద్, నార్లపాటి మల్లికార్జునరావులు మృతిచెందిన విషయం విధితమే. కాగా కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఎమ్మెల్యే బుర్రామధుసూదన్‌యాదవ్‌లు వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

బీసీ గర్జనను జయప్రదం చేయండి.

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం తపించి పనిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 7న విజయవాడలో జరగనున్న బీసీ గర్జనకు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని మండల వైసిపి కన్వీనర్ బొగ్గు రవి చెన్నారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తర్లుపాడు రోడ్డులోని ఎమ్మెల్యే కెపి క్యాంపు కార్యాలయంలో బిసి ప్రజా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు చెన్నారెడ్డి మాట్లాడుతూ అణగారిన బీసీ వర్గాలను ఉన్నత స్థితికి తీసుకెళ్ళేందుకు ముఖ్యమంత్రి జగన్ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు. ప్రత్యేకంగా బిసిల కోసం 56 కార్పొరేషన్ లను ఏర్పాటు చేసి, అనేకమందికి చైర్మన్, డైరెక్టర్ పదవులు ఇచ్చి గౌరవం కల్పించారని గుర్తు చేశారు. పార్టీలకు, వర్గాలకు అతీతంగా విజయవాడలో జరిగే బీసీ గర్జనకు భారీ ఎత్తున ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి బీసీ సంఘం మండల అధ్యక్షుడు బత్తుల అవులయ్య, నాయకులు ముంగమూరి పోలయ్య, దేవేంద్ర మల్లయ్య, ఓర్సు వీరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యకార్మికుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-దరిశి

దరిశి మండలంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 12 నెలలు వేతన బకాయిలు వెంటనే ఇవ్వాలని సిఐటియు దరిశి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కీసరి రాంభూపాల్ రెడ్డిని కోరారు. సోమవారం పారిశుధ్య కార్మికులు ఎన్‌జిఒ కార్యాలయం నుండి ర్యాలీగా బయలు దేరి తహశీల్దారు కార్యాలయంకు చేరుకుని మూడవ రోజున ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారు శ్రావణ్‌కుమార్ వచ్చి జీతాలు ఇచ్చేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచుల సంఘం అధ్యక్షులు రాంభూపాల్‌రెడ్డిను కలిసి వినతిపత్రం అందించారు. సర్పంచులతో మాట్లాడి జీతాలు ఇచ్చే విధంగా కృషి చేస్తాననిహామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు ఇస్మాయిల్, బాలగురవయ్య, ఎడ్లర్, ఆనందరావు, పుల్లయ్య, సంఘ సేవకులు జీవిరత్నంలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోంది

ప్రజాశక్తి - దరిశి

రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని ప్రకాశం, నెల్లూరు జిల్లాల టిడిపి పరిశీలకులు బిసి జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం దరిశిలోని కురిచేడు రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. సందువారిపాలెంలోని రామాలయం వద్ద రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమంను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో నారపశెట్టి పాపారావుతో పాటు నగర పంచాయితీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, రాష్ట్ర టిడిపి కార్యదర్శి రవీంద్ర, నియోజకవర్గ పరిశీలకులు బ్రహ్మయ్యచౌదరి, టిడిపి మండలపార్టీ అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు, ఒబుల్‌రెడ్డి, కూరపాటి శ్రీను, నాగులపాటి శివకోటేశ్వరరావు, మిడతల నెమిలయ్య, మాజీ జడ్‌పిటిసిలు స్టీవెన్, నాగరాజు, నాయకులు సంగా తిరుపతిరావు, వెంకటేశ్వర్లు, శోభారాణి, వెంకట్రావు, కొండారెడ్డి, నియో జకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఒంగోలు కలెక్టరేట్:** ప్రజల కష్టాలు తొలగాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. సోమవారం ఒంగోలు మండలం గుండాయిపాలెం, పాతపాడు పంచాయతీలలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. **కొండపి :** రాష్ట్ర జనాభాలో 50 శాతం పైగా ఉన్న వెనుకబడిన తరగతులు బిసిలకు గత మూడున్నర సంవత్సరాల నుండి తీవ్రమైన అన్యాయం చేస్తున్న ప్రభుత్వం ఒక్క వైసిపికే దక్కుతుందని కొండపి మండల బిసి నాయకులు అన్నారు. సోమవారం నాడు కొండపి మండల బిసి నాయకులు అందరితో కలిసి తహశీల్దారు పి.సింగారావుకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో కొండపి మండల బిసి నాయకులు పాల్గొన్నారు. **గిద్దలూరు :** తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశానుసారం రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి పాలనలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలను వ్యతిరేకిస్తూ స్థానిక



మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల

తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ కు పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చక పోగా, బీసీలను అణచివేస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ తెలుగు యూత్ అధ్యక్షుడు బూనబోయిన చంద్రశేఖర యాదవ్, 7వ వార్డు కౌన్సిలర్ బిల్లా రమేష్ యాదవ్, బీసీ నాయకులు మండ్ల బుజ్జి, శీలం కష్ణమూర్తి, నియోజకవర్గ బీసీ నాయకులు పందిళ్ళపల్లి శ్రీనివాసులు, పార్లమెంట్ తెలుగు యువత కార్యవర్గ సభ్యులు అనప వీరశేఖర్, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ అహ్మద్ భాష, తెలుగు యువత ఉపాధ్యక్షులు గిద్దలూరు మధు, తదితరులు పాల్గొన్నారు. **టంగుటూరు :** రాష్ట్ర జనాభాలో 50శాతం పైగా ఉన్న బీసీలకు గత మూడున్నరేళ్లగా తీవ్ర అన్యాయం జరుగుతుందని టంగుటూరు మండలానికి చెందిన బీసీ సంఘం నాయకులు సోమవారం తహశీల్దార్ కె చిరంజీవిని కలిసి బీసీలకు జరుగుతున్న అన్యాయంపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఒక్క రూపాయి కూడా కేటాయించి ఖర్చు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు మండల నాయకులు మల్లవరపు శ్రీదేవి, షేక్ బ్రహ్మయ్య, ధర్మాసి బ్రహ్మానందం, మల్లవరపు కిషోర్ బాబు, జక్కుల శ్రీను, కాకుమాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.**పెద్దదోర్నాల :** వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. సోమవారం దోర్నాల మండలంలోని చిన్నగుడిపాడు, బోడే నాయక్ తాండా, బొమ్మలాపురం గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ' ఇదేం ఖర్మ రాష్ట్రానికి ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏరువ మల్లికార్జునరెడ్డి, అంబటి వీరారెడ్డి, మాబు, శ్రీనివాస యాదవ్, వెంగళరెడ్డి, శేషాద్రి, బాషా, ఇస్మాయిల్, మల్లయ్య, కాశయ్య, చంటి పాల్గొన్నారు.**వెలిగండ్ల :** సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దళితులకు తీరని అన్యాయం జరిగిందని టిడిపి సీనియర్ నాయకుడు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పందువ ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్‌రెడ్డి, కేసరి రమణారెడ్డి, ఆవుల మాలకొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి కారంపూడి వెంకటేశ్వర్లు, కట్టుకూరి మదర్, తీట్ల చెన్నలక్ష్మి, జి.సుబ్రమణ్యం, శంకర్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.ఫోటో 2 నిరసన తెలియజేస్తున్న టిడిపి శ్రేణులు **కనిగిరి :** నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలమేరకు ఆయన ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్‌నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి రాష్ట్రంలో బిసిలకు ఇదేం ఖర్మ నిరసన కార్యక్రమాన్ని టిడిపి నాయకులు నిర్వహించారు. కార్పొరేషన్లుకు నిధులు ఇవ్వకుండా డైరక్టర్లను నియమిస్తే ప్రయోజనం ఏమిటని వారు ప్రశ్నించారు.అనంతరం తహశీల్దార్ వి పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తిమ్మనేని శ్రీనివాసరెడ్డి, నాయకులు షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, నంబుల వెంకటేశ్వర్లు, పిచ్చాల శ్రీనివాసరెడ్డి, బారాయిమాం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకూ'

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. 25వ డివిజన్ పరిధిలో గడప గడపకూ మన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. తొలుత గడపగడపకు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన బాలినేని శ్రీనివాసరెడ్డికి స్థానికుల ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, హారతులిచ్చి తమ ప్రాంతానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాగ సుజాత,డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నడిగడ్డ ఎస్ఎస్ ట్యాంకుకు గండి

వృథాగా పోతున్న నీరు



ఎస్ఎస్‌ట్యాంకుకు పడిన గండి



గండి నుంచి వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలంలోని నడిగడ్డ మంచినీటి పథకాన్ని ఐదేళ్ల క్రితం రూ.30 కోట్ల వ్యయంతో నిర్మించారు. 15 గ్రామాలకు మంచినీటి సరఫరా చేసే ఈ పథకం చెరువు నిర్మాణానికి రూ.కోటీ 80 లక్షల ఖర్చయింది. దీన్ని సిరి ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ హైదరాబాద్ వారు పర్యవేక్షిస్తున్నారు. దీని లోతు 14 అడుగుల మేర ఉంటుంది. దీని కెపాసిటీ 4437 మిలియన్ లీటర్లు. ప్రస్తుతం గండి కారణంగా 380 మిలియన్ లీటర్ల నీరు బయటకు వెళుతోంది. కేవలం అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఈ ట్యాంకుకు గండి పడింది. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పొంతనలు లేని సమాధానాలు చెబుతున్నారు. ప్రతియేటా మరమ్మతుల పేరుతో రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు.

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు : మంత్రి

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హెచ్చరించారు. నడిగడ్డ ఎస్ఎస్ ట్యాంక్‌కు గండి పడిన ఘటనపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సోమవారం మంత్రి మాట్లాడారు. యుద్ధ ప్రాతిపదికన గండికి మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. నడిగడ్డ ప్రాజెక్టు ద్వారా పంపిణీ జరుగుతున్న 15 గ్రామాలకు నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు అన్ని మండలాల్లో అందుబాటులో ఉంటూ గ్రామాల్లో మంచినీటి పథకాలు మరమ్మతులకు గురైతే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని చెప్పారు. భూగర్భ జలమట్టం పడిపోయి నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ఎక్కడైనా నీటి ఎద్దడి ఉన్నట్లు ప్రజలు తన దృష్టికి తెస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'స్పందన'ను సమర్థవంతంగా నిర్వహించండి

కలెక్టర్ దినేష్ కుమార్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్పందన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. అర్జీదారులకు సహేతుకమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్, స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆర్జీలు, ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది అర్జీలను పరిష్కరిస్తున్న తీరును ఆయా శాఖల ఉన్నతాధికారులు, స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా సకాలంలో అర్జీదారునికి సహేతుక పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు విశేష స్పందన

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ప్రజలు ఫోన్లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

–పొదిలి మండలం కాటూరివారిపాలెం నుంచి వై.నర్సింహారావు ఫోన్ చేసి ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా సక్రమంగా లేదని ఫిర్యాదు చేశారు. తమ గ్రామంలో బోరు వేయించాలనికోరారు. స్పందించిన కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

– కొనకనమిట్ల మండలం గొట్లగట్టు గ్రామం నుంచి పి. చెన్నారాయుడు ఫోన్ చేసి సర్వే నం.123-1 లోని 2.95 ఎకరాలు ప్రభుత్వ అన్యాక్రాంతమైందని, ఈ విషయమై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

– తర్లుపాడు మండలం పోతలపాడు గ్రామం నుంచి ఆర్. చిట్టి బాబు ఫోన్ చేసి దారి స్థలాన్ని ఆక్రమించడంతో తన పొలానికి దారి లేకుండా పోయిందని, తనకు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ సర్వే చేయించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, డిఆర్ఒ బిసిహెచ్. ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గ్లోరియా, ఉమాదేవి, హెలా షారోన్, ఇతర అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన వారికి స్థానాలు కేటాయించాలి

- యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు

- కలెక్టరేట్ వద్ద మెరుపు ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

బదిలీలు జరిపి పదోన్నతలు పొందిన వారికి స్థానాలు కేటాయించి అవసరమైతే అడ్జస్ట్‌మెంట్ చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కలెక్టరేట్ వద్ద మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని హైస్కూళ్లలో ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో బోధన కుంటుపడిందన్నారు. తొలుత బదిలీలు జరిపి పదోన్నతుల ద్వారా ఖాళీలను భర్తీ చేయాల్సి ఉండగా, పదోన్నతులు ఇచ్చారన్నారు. స్థానాలు కేటాయించలేదన్నారు. గత 8 నెలలుగా బదిలీలు జరుపుతామని నేటికీ జరపలేదన్నారు. పేపర్ ప్రమోషన్ ఇచ్చి నేటి వరకు స్థానాలు కేటాయించలేదన్నారు. బదిలీలు జరపక, పదోన్నతులకు స్థానాలు కేటాయించక సంవత్సరం మధ్యలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో 251 మందిని జిల్లాలో 50 నుంచి 100 కిలోమీటర్ల దూరంగా వేస్తున్నారని దీన్ని యుటిఎఫ్ ఖండిస్తుందన్నారు. తప్పనిసరి పరిస్థితులలో అదే మండలంలో వేయాల్సి ఉండగా, మండలాలు దాటి సుదూర ప్రాంతాలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో వేస్తున్నారన్నారు. ఈ విధానాన్ని మానుకోవాలని మధ్య విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసే అంశమిదన్నారు. విద్యార్థుల దృష్ట్యా వెంటనే ఖాళీలు భర్తీకి బదిలీలు జరిపి పదోన్నతులు పొందిన వారికి స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మెరుపు ధర్నాలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఒవి.వీరారెడ్డి, ఎస్.రవి, సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి

అర్జీలకు సత్వర పరిష్కారం : ఎస్‌పి

ఒంగోలు క్రైం: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను విచారించి సత్వరమే పరిష్కరిం చాలని ఎస్‌పి మల్లిక గర్గ్ అధికారులను ఆదేశించారు. ఎస్‌పి కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 98 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సంబంధిత అర్జీలను ఆయా పోలీస్ స్టేషన్లకు పంపి విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పిలు కె.నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు, డిఎస్‌పిలు మరియదాసు, రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి

మూడు ఎకరాల భూమిని పంచాలి : వ్య.కా.సం



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల అంజనేయులు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

వ్యవసాయ కార్మికులకు ప్రతి కుటుంబానికి మూడు ఎకరాలు తగ్గకుండా భూమిని పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈనెల 8 9 10 తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం ప్రచార జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా 200 రోజుల పనిదినాలు కల్పించారు. రోజు వారీ కనీస వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో బటన్ నొక్కుడు కార్యక్రమం కాస్త పేదల జోబులను నొక్కుడు కార్యక్రమంగా మారిందన్నారు. సంక్షేమ ముసుగులో సంక్షోభాన్ని అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయల కట్టబెట్టే పాలకులు వ్యవసాయ కూలీలకు కూలి పెంచడానికి మాత్రం అంగీకరించడం లేదన్నారు వందల ఎకరాలు భూస్వాములు చేతుల్లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురునాథం, రాములు, గాలివోటు ఏసోపు,డివైఎఫ్ఐ నాయకులు కొమ్మల చిన్నరామయ్య, దమ్ము బాల వెంకటేశ్వర్లు, కోటికల బాల చెన్నకేశవులు, మురళి పాల్గొన్నారు.